విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా



అర్హులందరికీ సకాలంలో సంక్షేమ పథకాలు: మంత్రి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: అర్హత గల ప్రతి కుటుంబానికి టంఛన్ గా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలం కంటేపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఒకవైపు వర్షం కురుస్తున్నా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రి, ప్రభుత్వం నుంచి వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించి, అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు రావాలా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వర్షంలోనూ మంత్రి ప్రతి గడపకు వచ్చి ఆ కుటుంబ సభ్యులతో మమేకమవడం అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రతి గడపలోను మంత్రికి ప్రజలు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి స్థలం లేని వారిని గుర్తించి, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తున్నామని, ఒక్క కంటేపల్లిలోనే సుమారు 600 మందికి ఇంటి నివేశ స్థలాలు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. అర్హత గల కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరాలో ఆమేర లబ్ధి చేకూరిందని, ఈ గ్రామంలో కల్లు రామసుబ్బమ్మకు రూ. 6.06 లక్షలు, కర్నాటి చిన అంకయ్యకు రూ. 5.71 లక్షలు, సైదాపేట చెంగమ్మకు రూ. 6 లక్షలకు పైగా లబ్ధి చేకూరినట్లు మంత్రి వివరించారు. పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకొని అభివృద్ధి పనులను సత్వరమే చేపట్టడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుస్మిత, ఎంపీటీసీ శివ, స్థానిక నాయకులు మందల వెంకట శేషయ్య, వెంకటేశ్వర్లు, మణి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోవూరులో ఏసీబీ అధికారుల తనిఖీ

విశాలాంధ్ర- కోవూరు: జిల్లా పౌర సరఫరా కార్యాలయం లో జరిగిన అవినీతి అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఎదుర్కొంటున్న నేపథ్యం లో సంబంధిత వ్యక్తులు నివాస గృహలపై ఏసీబీ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా కోవూరు పట్టణం లోని సినిమా హాల్ సమీపంలో పవన్, సూరి, నివాసాలలో ఏసీబీ అధికారులు సోద చేశారు. ఇంట్లో పరిశీలించి, ఆధారాలు కోసం వెతికారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర- విడవలూరు: మండల కేంద్రమైన విడవలూరు గ్రంథాలయం లో సోమవారం నుండి 20వ తేదీ వరకు లైబ్రేరియన్ వారోత్సవాలు జరగనున్నాయిఅని గ్రంథాలయ అధికారి నిరూప తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు వివిధ క్రీడా, వ్యాసరచన, వివిధ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు ఈ పోటీలలో విడవలూరు లో గల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని గ్రంథాలయాధికారి కోరారు.

కార్తీకమాస వన భోజన మహోత్సవం

విశాలాంధ్ర- నెల్లూరు: అల్లూరుమండల వేణుగోపాల స్వామి దేవస్థానంలో బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో కార్తీకమాస వన భోజన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ముప్పిరాల రాఘవయ్య అధ్వర్యంలో అభిషేకం తదుపరి ఉదయగిరి ఆనంతనారాయన చే తులసి కళ్యాణము వేద పండిత సత్కారము లక్ష పసుపుకొమ్ముల నోము బ్రాహ్మణ వన సమారాధన జరిగాయి. ఈ కార్యక్ర మానికి మండలంలోని బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరు పాల్గొన్నారని మండల బ్రాహ్మణ సంఘ సెక్రటరీ కామకొలను రాధాకృష్ణ తెలియజేశారు.

సముద్రం వేటకు వెళ్లొద్దు: ఎంపీపీ

విశాలాంధ్ర- నెల్లూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సముద్ర తీర ప్రాంతమైన ఇస్కపల్లి గ్రామపంచాయతీ నందు తీసుకోవలసిన జాగ్రత్తలగురించి ఎంపీపీ దర్శిగుంట శశి రేఖ ఎంపిడిఓ శ్రీ దేవీ ఈఓఆర్డీ పెంచల వీరేంద్ర స్థానికులతో చర్చించి తగు సూచనలు ఇచ్చారు. మత్స్య కారులని కలిసి సముద్రం లోకి చేపల వేట కి వెల్లోదని వలలను జాగ్రత్త పరుచుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ రంజిత్ పంచాయతీ సెక్రటరీ మురళి కృష్ణ నాయకులు బీద రమేష్ బాబు దర్శిగుంట వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ఎమ్మెల్యే మేకపాటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి 2 వేల జనాభా కోసం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం అప్పారావు పాలెంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం ఆరుణమ్మతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత గ్రామానికి విచ్చేసిన జడ్పీచైర్మన్ ఆనం ఆరుణమ్మ, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్ర తినిధులు, కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, సచివాలయ నిర్మాణ స్థల దాతలు కలసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో సంక్షేమ పాలన అందిం చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను అందరూ సద్వినియోగం చేసుకో వాలన్నారు. పంచాయతీల్లో సచివాలయ వ్యవస్థ కోసం ఇలా దాతలు స్థలాన్ని అందచేయడం అభినందనీయమని, గ్రామానికి అవసరమైన ప్రభుత్వ సముదాయాలు ఒకే చోట ఉండడంతో ప్రజలు కూడా పనుల కోసం మరెక్కడా తిరగాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసుకునేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతో పాటు ప్రజలు తమ పూర్తి సహకారం అందిస్తేనే మోడల్ పంచాయతీలుగా రూపొందుతాయని, తద్వారా పంచాయతీలు అభివృద్ధి చెందడమే కాక ప్రజలంతా సమస్యలు లేకుండా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో , ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటీసి ప్రసన్నలక్ష్మి, ఏఎస్పేట జడ్పిటీసి పదిళ్లపల్లి రాజేశ్వరమ్మ,మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్, పెమ్మసాని శ్రీనివాసులునాయుడు, వల్లభనేని రాజేంద్రనాయుడు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, సానా వేణుగోపాల్ రెడ్డి, గడ్డం శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివస్నాలు,బట్టేపాడు సొసైటి చైర్మన్ వాశిపల్లి లక్ష్మిరెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు లో కమిషనర్ విస్తృత పర్యటన

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని, ఏలాంటి విపత్కర పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ శ్రీమతి హరిత ఆదేశించారు. భారీ వర్షాలకు నగరంలోని మాగుంట లే అవుట్, వనంతోపు, ఇస్కాన్ టెంపుల్ తదితర ప్రాంతాలలో ప్రధాన డ్రైను మార్గాలు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, అండర్ బ్రిడ్జ్ ల పరిస్థితిని అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఏలాంటి విపత్కర పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ హరిత ఆదేశించారు. భారీ వర్షాలకు నగరంలోని మాగుంట లే అవుట్, వనంతోపు, ఇస్కాన్ టెంపుల్ తదితర ప్రాంతాలలో ప్రధాన డ్రైను మార్గాలు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, అండర్ బ్రిడ్జ్ ల పరిస్థితిని అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితుల నుంచి సమాచారం తెలుసుకుంటున్నామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో సమస్యలు కలిగినవారు 18004251113, 0861 230 1541 నెంబర్లకు సమాచారం అందించి నగర పాలక సంస్థ నుంచి తగిన సహాయం పొందాలని కమిషనర్ సూచించారు. రహదారులు, రోడ్లు, అండర్ బ్రిడ్జ్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తోడివేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పాదచారులు, వాహన చోదకులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన ప్రాంతాలలో అధికారులు పర్యవేక్షిస్తున్నారని కమిషనర్ వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు భారీ వృక్షాలు, హోర్డింగులు సమీపంలో నిలవడం, వాహనాలు పార్క్ చేయడం, విద్యుత్ స్థంబాలను చేతితో తాకడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కమిషనర్ సూచించారు. నగర పాలక సంస్థ లోని అన్ని విభాగాల అధికారులు, ఇండోర్ , ఔట్ డోర్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు అందరికీ సెలవులు రద్దు చేస్తున్నామని, ఆదేశాలు అందిన వెంటనే సేవలు అందించేందుకు సంసిద్ధంగా ఉండాలని కమిషనర్ సూచించారు. భారీ వర్షాలకు వరద నీరు పెరుగుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు కార్పొరేషన్ సూచించిన టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించి పునరావాసం పొందాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ నూతన భవనంలోకి మార్పు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు నెల్లూరు బ్రాంచ్ నూతన భవనం లోకి మార్చారు. గతంలో రేపల వారి వీధిలో ఉండే ఈ బ్రాంచి పప్పులు వీధిలోకి మార్చారు. ఈ నూతన భవనంకు విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాఘవేందర్ రావు ప్రారంభించగా నెల్లూరు కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అరిగెల నాగేంద్ర సాయి బ్యాంకు కార్య నిర్వహణ అధికారి క్యాబిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వి రామరాజు జె సి ఎస్ అమర్నాథ్,గునుపాటి ప్రసాద్ రెడ్డి, బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ శర్మ, బ్యాంకు సిబ్బంది పలువురు ఖాతాదారులు, సభ్యులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన గడపగడపకు మనప్రభుత్వం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: వర్షంలోనూ... నిరంతరాయంగా కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కొనసాగుతోంది. వెంకటాచలం మండలం కంటేపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి పాల్గొన్నారు. వర్షంలోనూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

పరిశ్రమల స్థాపనే విద్యార్థుల లక్ష్యం కావాలి

విశాలాంధ్ర -కందుకూరు: పరిశ్రమల ఉద్యోగాల కోసం వెంప ర్లాడకుండా వాటి స్థాపన లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని విశిష్ట ఇన్నోవేటర్స్ లిమిటెడ్ సీఈఓ సాందీప్ ఉద్బోధించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ లో మూడు రోజులు పాటు జరిగిన ఎంబెడెడ్ ఐ.ఓ.టి (ఐయస్ ఐఓటి) ప్రయోగాత్మక శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కోర్ జాబ్స్ భవిష్యత్తు స్థిరీకరణకు బాటలు వేస్తాయన్నారు. సాఫ్ట్ వెర్ జాబ్స్ లో పలు ఒడిదుడుకులుంటాయనేది జగద్విదిత మని సందీప్ అభివర్ణించారు. సెల్ఫిస్ (స్వార్థం) ప్రతి ఒక్కరిలో ఉండాలని, అయితే అది తనకే పరిమితం కాకుండా సామాజిక సెల్ఫిష్ గా ఉంటే బహు ప్రయోజనమని వివరించారు. ఏదైనా శిక్షణ పొందిన తర్వాత ప్రాక్టీస్ నిరంతరంగా ఉండాల్సిన ఆవశ్యకతను ప్రకాశం టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ పేర్కొన్నారు. నిరంతరం కాలేజీలో జరిగే వర్క్ షాప్స్, సాంకేతిక శిక్షణలో విద్యార్థులు భాగస్వాములు అయితే ఇంజనీరింగ్ కోర్సుకు పరిపూర్ణత సమకూరుతుందని స్పష్టం చేశారు. అలాగే ఇంటర్నెట్ లో ఉచితంగా లభించే పలు సర్టిఫికేషన్స్ కోర్సులు జాబ్ ఇంటర్వ్యూలలో బలోపేతంగా ఉంటాయని విజయ్ వివరించారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ వ్యయ ప్రయాసలతో విద్యార్థుల సంక్షేమానికి ఏర్పాటు చేస్తున్న వర్క్ షాప్ లు, శిక్షణ కార్యక్రమాలు సత్ఫలితాలు నిస్తూఉండడం ఆనందంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ప్రాజెక్టుల రూపకల్పనలో మినీ కోల్డ్ స్టోరేజీద్వారా తమ కాలేజీ ఇఇఇ విద్యార్థులు 2022 ఛాంపియన్స్ గా ప్రథమ స్థానం సాధించడం ప్రతిష్టాత్మకంగా బాలిస్తున్నామన్నారు. విద్యార్థులు శ్రద్ధా శక్తులు చూపితే ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్ కిట్స్ తయారీ పరిశ్రమ స్థాపనకు తాము సిద్ధంగా ఉన్నామని రామయ్య విద్యార్థుల హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. మూడు రోజుల స్వల్ప కాలంలో ఇఇఇ విద్యార్థులకు ఇచ్చిన ఐయస్ ఐఓటి శిక్షణ రెండు సంవత్సరాల విద్యార్థుల అనుభూతికి కృతజ్ఞతగా సీఈఓ సాందీప్ ను ఘనంగా సత్కరించారు. అకడమిక్ ఇంన్ చార్జ్ ఎస్.యం. మీరావలి ఆహ్వానం మేరకు వచ్చిన పూర్వ విద్యార్థి శివకృష్ణ విద్యార్థులకు ఉపాధి కల్పనలో పరిపూర్ణ సహకార భరోసా ఇచ్చారు. యాజమాన్యం - విద్యార్థులు అందించిన సన్మానాన్ని శివ కృష్ణ స్వీకరించారు.

నీటిపారుదుల శాఖ అధికారుల నిర్లక్ష్యం పట్టణం జలమయం

విశాలాంధ్ర - కావలి : ముందస్తు ప్రణాళిక లేని నీటి పారుదల శాఖ అధికారుల కారణంగా కావలి పట్టణం జలమయం అయింది. రియల్ ఎస్టేట్ దారులు పంట కాలువలు, డొంకలు, వాగులు అన్నింటినీ ఆక్రమించి లే-అవుట్లు వేయడంతో గాయత్రీ నగర్ ప్రాంతం పూర్తిగా జలమయం అయింది. ఎగువ ప్రాంతం నుండి వచ్చే నీరు పంట కాలువల ద్వారా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇళ్లపైకి వచ్చి గాయత్రీ నగర్ ను ముంచివేసింది. నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం తో రియల్ ఎస్టేట్ దారులు రెచ్చి పోయి ఆక్రమణలకు పాల్పడి పట్టణాన్ని ముంచేశారు. పంట కాలువలు, డొంకలు ఆక్రమిస్తున్నారని ప్రజల నుండి పెద్ద ఎత్తున పిర్యాదులు అందినప్పటికీ నీటి పారుదల అధికారులు పట్టించుకోకపోవడం, మామూళ్ల మత్తులో తూలడంతో పట్టణం జలదిగ్బంధం అయినది.

కార్తీక వనభోజనాల్లో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కందుకూరు: కందుకూరు వాసవి నగర్ నందు వాసవి నగర్ ఆర్యవైశ్య డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటుచేసిన వనభోజనాల్లో శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మహీధర్ రెడ్డి మాట్లాడుతూ వాసవి నగర్ వాసులందరూ ఐకమత్యంగా కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడం, ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందనిశాసనసభ్యులు మహీధర్ రెడ్డి అన్నారు. వాసవి నగర్ లో ఒక మంచి ఆలయం నిర్మించుకుంటే ఇంకా ఆధ్యాత్మికంగా ఉంటదని ఆయన సూచించారు. ఆర్యవైశ్యులందరూ ఒకే చోట ఇలా కలుసుకోవడం మంచిదని అన్నారు. వాసవి నగర్ ప్రెసిడెంట్ ఇడుపులపాటి రంగారావు మాట్లాడుతూ తన ఆహ్వానాన్ని మన్నించి వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురారిశెట్టి శ్రీకాంత్, పబ్బిశెట్టి శివ, అప్పల మధు, తాతా సంపత్,మురారిశెట్టి సుబ్బారావు,మోదడుగు నరసింహం, కంద గడ్ల వెంకటేశ్వర్లు,మురారిశెట్టి శ్రీను,చీదేళ్ల వేణుగోపాల్, కోటా నరసిహం, కనమర్ల పూడి మురళి,చక్కా వెంకట కేశవరావు, మోదడుగు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు,ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర- ఉదయగిరి: స్థానిక పట్టణంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులే తక్షణమే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఫర్దీన్ బాషా ఆదివారం డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చినుకు పడితే ఉప్పొంగి ప్రవహించే మురికి నీటిని అరికట్టేందుకు ప్రధాన రహదారుల వెంబడి సైడ్ కాలవలు ఏర్పాటు చేయాలన్నారు. మూగజీవాల కళేబరాలు తాగు నీటిలో పడి దుర్గంధం వెదజల్లుతున్న ట్యాంక్ బండ్ ఆనకట్టలోని గుర్రపు డెక్కన్ తొలగించి పొంచి ఉన్న చర్మ వ్యాధులు విష జ్వరాలను అరికట్టాలన్నారు. ఎక్కడపడితే అక్కడే చెత్త నిలవలు దర్శనం ఇవ్వకుండా చెత్తకుండీలను పట్టణ ప్రధాన పరిసరాలలో ఏర్పాటు చేయాలన్నారు. నాల్గురోజులకు ఒకరోజు వచ్చే పంచాయతీ నీటిని రోజు మార్చి రోజు పట్టణ ప్రజలకు వాడుకునేల అందించేలా పెద్ద చెరువులోని పైపులను ద్వారా నూతన ట్యాంక్ నిర్మించి నీటిని సరఫరా చేయాలన్నారు. ప్రారంభం కు సిద్ధంగా ఉన్న పలు ప్రాంతాల్లోని సుజల వాటర్ ప్లాంట్లను ప్రారంభించి ప్రజలకు మంచినీటిని అందిం చాలన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పై సమస్యలు చర్యలు చేపట్టాలని సిపిఎం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గద్దం నాగేశ్వరరావు, మహిళ ఐద్వా నాయకు రాలు కామక్షమ్మ, స్థానిక నాయకులు తిమ్మయ్య రంతూజానీ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులు స్పందించండి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్ 9 వ వీధిలో గాజుల పోలమ్మ నివాసములో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇంట్లో సామాన్లు మొత్తం తగలబడిపోయాయి. ఆమె పాచిపనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఇంటిలో ఎవ్వరు లేని సమయం లో ఈ ప్రమాదం ఏర్పడింది. షుమారు 50, 000 వేలు ఆస్తినష్టం జరిగింది.

టిడిపి కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్న కోవూరు నియోజకవర్గ ఇంచార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి

విశాలాంధ్ర- విడవలూరు: టిడిపి కుటుంబ సభ్యుల ఆశీర్వాద కార్యక్రమం, గాలి వాన సైతం లెక్కచేయకుండా ఆనవాయితీగా ప్రారంభించారు. నెల్లూరు జిల్లా విడవలూరు మండలం రామచంద్రపురం పంచాయతీ పాతూరు గ్రామం నుండి, లక్ష్మీపురం వెంకటనారాయణపురం, బుసగాడి పాలెం, చంద్రశేఖరపురం, రామచంద్రాపురం, గిరిజన కాలనీ,ప్రశాంతగిరి,ఊటుకూరు, పెద్దపాలెం గ్రామాల్లోని నాయకులును కార్యకర్తలను కలిసి పోలవరం రెడ్డి దినేష్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ క్రమంలో మాట్లాడుతూ చంద్రబాబుని సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అలాగే పని చేస్తామని అని అన్నారు. ఈ క్రమంలో భాగంగా బుసగాడి పాలెం నుండి కొండూరు జేజి,వైకాపా నుండి తెలుగుదేశం పార్టీలోకి చేరగా దినేష్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, క్లస్టర్ ఇంచార్జ్ మాతూరు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా మత్స్య కారు సంఘం ఉపాధ్యక్షుడు ఆవుల రవీంద్ర, నియోజకవర్గ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రవిచంద్ర, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆవుల రామచంద్రయ్య, చిన్నిబాబు,సత్యం రెడ్డి, ఇమామ్ భాష, తదితరులు పాల్గొన్నారు.

ఇసక దొరువులో గృహాలు కూల్చివేత

విశాలాంధ్ర- తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు మండలం మండపం పంచాయతీ మజారా ఇసకదొరువు గ్రామంలో ఆదివారం రెవిన్యూ శాఖ అధికారులు జేసీబి యంత్రం ద్వారా ఇళ్లను తొలగించారు. ఇసకదొరువు విద్యుత్ ప్రభావిత గ్రామం కావడంతో ప్రభుత్వం గ్రామస్తులకు సాలిపేటలో ప్రాంతంలో ఇళ్లు నిర్మించి పునరావాసాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మేరకు 45 కుటుంబాలు పునరావాసం కింద సాలిపేటలో నిర్మించిన గృహాల్లో చేరిపోయారు. కాగా ఈ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం కొత్తగా మరో 15 కుటుంబాలు గ్రామంలో వచ్చి చేరాయి. పునరావాస గ్రామంలో తమకు కూడా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న ప్రతిపాదనను నూతనంగా వచ్చిన కుటుంబాలు ప్రభుత్వం ముందు వుంచాయి. ఈ 15 కుటుంబాలు ఇసకదొరువు గ్రామాన్ని ఖాళీ చేయకుండా అక్కడే నివాసముంటున్నాయి. ఇళ్లను ఖాళీ చేయాలంటూ పలుమార్లు సూచించినప్పటికి పట్టించుకోక పోవడంతో అధికారులు ఇళ్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబా లకు పునరావాస గ్రామంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అలాగే రూ. 5 లక్షలు పరిహారం కింద ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఈ 15 కుటుంబాలు భీష్మిం చాయి. ఈ నేపథ్యంలో ఒకింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇళ్ల తొలగింపు ప్రక్రియను తహశీల్దార్ హమీద్ పర్య వేక్షించారు.

అడుగడుగునా ముస్లింల ఆత్మీయ పలకరింపు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మైనార్టీల ప్రాంతంలో ఆసక్తికరంగా సాగుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గడపగడపకు కార్యక్రమం నెల్లూరు రూరల్ నియోజకవర్గం 34వ డివిజన్ ముస్లిం మైనార్టీలకు ప్రధాన అడ్డాగా ఉంది. చాలామంది దీన్ని మినీ పాత బస్తిగా పోలుస్తారు. దాదాపు ఈ ప్రాంతంలో 5700 ఓట్లు ఉంటే 4,000 మంది ముస్లింల ఓట్లు ఉండటం గమనార్హం. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపొందే వార్డుల్లో ఈ డివిజన్ ఉంటుందని జర్నలిస్ట్ ఫ్రెండ్స్ మొదటి నుంచి భావించింది. అయితే ముస్లిం ఓటర్లను పోలరైజేషన్ చేయడంలో టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తో పాటు పోటీచేసిన అభ్యర్థి స్థానిక టిడిపి నేతలు వైఫల్యం కారణంగా స్వల్ప తేడాతో ఓటమి చెందాల్సి వచ్చింది. ఈ ప్రాంతంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గడప గడపకు కార్యక్రమం ఆసక్తికరంగా సాగుతోంది. ఆదివారం స్థానిక ప్రగతి నగర్ పదోవీధితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా లేదా అంటూ ఆరా తీశారు స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ తెలుసుకొని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు పలువురు ముస్లిం మైనార్టీలు ఆయనకు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్లు అధ్వానం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జగనన్న కాలనీల పరిస్థితి, టిడ్కో ఇళ్ల వద్ద వసతులను జనసేన నాయ కులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి రెండో రోజున పరిశీలించారు. అనంతరం 181వ రోజు పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని 54వ డివిజన్ జనార్ధన్ రెడ్డి కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క రోజు కురిసిన భారీ వర్షానికే నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జగనన్న కాలనీ నీట మునిగిందని, టిడ్కో అపార్టుమెంట్ల ఇళ్ల వద్ద పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అన్నారు. ప్రజలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను కూడా వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. పేద ప్రజలంటే జగన్ రెడ్డి ప్రభుత్వానికి చులకన భావం ఉందనే అంశం ఈ ఇళ్ల విషయంలో తేటతెల్లం అవుతుందన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ ప్రాంతంలో సౌకర్యాలు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్తీక మాస వనభోజనం

విశాలాంధ్ర-కందుకూరు: పట్టణంలోని వాసవినగర్ ఆర్యవైశ్య డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో వాసవినగర్ లోని వరసిద్ధి వినాయక స్వామి ప్రాంగణం నందు ఏర్పాటుచేసిన కార్తీక మాస వనభోజన కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి నగర్ ఆర్యవైశ్య డెవలప్మెంట్ అధ్యక్షులు ఇడవలపాటి రంగారావు, సెక్రెటరీ అప్పల మధు, ట్రెజరర్ తాత సంపత్, నియోజకవర్గ టీడీపీ వాణిజ్యభాగం అధ్యక్షుడు మొదడుగు వెంకటేశ్వర్లు, కొత్తూరు వెంకట సుధాకర్, యల్లంపల్లి నాగేశ్వర రావు, నూకల సుబ్బారావు, వాసవి నగర్ ఆర్యవైశ్య డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలక్రిష్ణ రెడ్డి నగర్ సందర్శన

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని 16వ వార్డు బాలక్రిష్ణ రెడ్డి నగర్ ను ఆదివారం సీపీఎం నాయకులు సందర్శించారు. భారీ వర్షాలకు జలమయమైన రోడ్లును, ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ బాలక్రిష్ణ రెడ్డి నగర్ ఏర్పడి సుమారు 25 సంవత్సరాలు అయినప్పటికీ ఇక్కడ సుమారు వెయ్యి కుటుంబాల నిరుపేదలు నివాసముంటున్నారని, వీరందరూ నిత్యం కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారన్నారు. ఈ కాలనీలో రెండు మూడు రోడ్లు మినహా మిగిలిన వీధులన్నీ కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమై, ప్రజలు తిరగలేని పరిస్థితి ఉన్నదన్నారు. ముఖ్యంగా రాకపోకల కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికలప్పుడు వాగ్దానాలు చేసిన ప్రజా ప్రతినిధుల మాటలు నీటిమూటల లాగే మిగిలిపోతు న్నాయన్నారు. అధికారులు, ప్రభుత్వాలు మారుతున్న ప్పటికి పేదల సమస్యలలో మార్పు లేదని దానికి బాలక్రిష్ణ రెడ్డి నగర్ పేదలే నిదర్శనమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజి వసతులు ఏర్పాటు చేసి పేదల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు యర్రంశెట్టి క్రిష్ణ మోహన్, పి. పెంచల నరసింహం, నాయకులు కె. చెన్నయ్య, మోతే సాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తో ఓవెల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రుల భేటీ

- 960 మంది విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆవేదన
- విద్యా సంవత్సరం ఐదు నెలలు మాత్రమే ఉందని పిల్లలకు న్యాయం చేయాలని వినతి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని తెలుగు గంగ కాలనీ సమీపంలో ఉన్న ఓవెల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో ఆదివారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఓవెల్ 14 స్కూల్లో జరిగిన ఘటన దారుణమని ఈ ఘటనకు పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఇదే స్కూల్లో 960 మంది విద్యార్థులు చదువుతున్నారని, స్కూలు గుర్తింపు రద్దు చేయడం వల్ల 950 మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారవుతుందన్నారు. విద్యా సంవత్సరం ముగింపుకు మరో ఐదు నెలలు మాత్రమే ఉందని ఇప్పుడు వెళ్లిపొమ్మంటే 960 మంది విద్యార్థులు ఎక్కడికి వెళ్లాలని ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అన్యాయం జరగకుండా తమ విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే తప్పు చేసిన పిఆర్ఓ పై కఠిన చర్యలు తీసుకుంటామని అందుకు అనుగుణంగా ఇప్పటికే అధికారులకు కూడా ఆదేశాలు ఇచ్చామన్నారు. 960 మంది విద్యార్థులు భవిష్యత్తు దృష్ట్యా స్కూలును నడిపేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులతో మాట్లాడి తన వంతుగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఏ విద్యార్థికి అన్యాయం జరగకుండా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

చేజర్ల ఆర్థిక సాయం

విశాలాంధ్ర- ఉదయగిరి: స్థానిక హరిజనవాడకు చెందిన గడ్డం రాజుకు చేజర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. రాజు గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న చేజర్ల సుబ్బారెడ్డి అతని స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఐదు వేల రూపాయలు నగదును అందజేశారు. అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. త్వరగా కోలుకుని గతంలో మాదిరిగానే విధులు నిర్వహించుకోవాలని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్ మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరి ఎండి రియాజ్ పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: గడపగడపకి మన ప్రభుత్వంను కలువాయి మండలం కేశమనేని పల్లిలో మాజీ మంత్రి, వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయం నూతన భవనాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. కేశమనేనిపల్లి సచివాలయ పరిధిలోని 1040 నివాస గృహాలకు నవరత్నాలు వైఎస్ఆర్ సంక్షేమ పథకాల ద్వారా 3036 మంది లబ్ధిదారులకు 7 కోట్ల93 లక్షల 80 వేల 736 రూపాయలు వారి ఖాతాలకు జమ చేశామని ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కలువాయి మండల పరిధిలో నవరత్నాలు వైఎస్ఆర్ సంక్షేమ పథకాల ద్వారా 44,475 మంది లబ్ధిదారులకు 103 కోట్ల 65 లక్షల 05 వేల 858 రూపాయలు అందించామని తెలిపారు. కేశమనేని సచివాలయం పరిధిలో నూతన సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, నూతన రైతు భరోసా కేంద్రానికి రూ.21.50 లక్షలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనానికి 17.50 లక్షల రూపాయలు. బల్క్ మిల్క్ చిల్ యూనిట్ కు 16.74 లక్షల రూపాయలు, కేశమనేనిపల్లి డిజిటల్ లైబ్రరీ కు 16.00 లక్షల రూపాయలు, పెరంకొండ డిజిటల్ లైబ్రరీ కు 16.00 లక్షల రూపాయలు నాడు నేడు ద్వారా 5 పాఠశాలల అభివృద్ధి కోసం (ఫేజ్ 1, 2) - 70 లక్షలు. జల జీవన్ మిషన్ ద్వారా 4 పనులకు 26.00 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా సమాన ప్రాధాన్యతతో గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా కృషిచేస్తున్నామన్నారు.

మందాడి నరసింహులు కి ఘన నివాళి

విశాలాంధ్ర-మర్రిపాడు: మండల పరిధిలోని కేతిగుంట గ్రామం లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మందాడి నరసింహులు చౌదరి సంతాప సభను ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రం లోని యు టి ఎఫ్ భవనం లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు, యుటిఎఫ్ సభ్యులు మరియు అన్ని పార్టీల రాజకీయ నాయకులు పాల్గొని ఆయన కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చేసిన సేవలు గుర్తుకు తెచ్చుకొని ఉపాధ్యాయుడు మందాడి నరసింహులు చౌదరి ఆకస్మిక మృతి మండల వాసులను, కుటుంబ సభ్యులను, తోటి ఉపాధ్యాయులకు, రాజకీయ ప్రముఖులలో తీవ్ర విషాదం నింపిందన్నారు. శోకసంద్రాంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూనియన్ సభ్యులు, మండల రాజకీయ ప్రముఖులు, నరసింహులు చౌదరి కి సంతాపం తెలుపుతూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన భార్య పద్మావతి కు కుమారుడు ధ్రువకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుని కోరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వివి శేషు, జిల్లా కార్యదర్శి మోహన్ ప్రసాద్ మరియు పలువురు ప్రముఖులు మాట్లాడుతూ నరసింహులు చౌదరి ఆకస్మిక మృతి వారి కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకే గాక మండల ప్రజలకు తీరనిలోటని సానుభూతి తెలుపుతూ సంతాపాన్ని తెలిపారు. అనంతరం నరసింహులు చౌదరి జ్ఞాపకర్థం నెల్లూరు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 50 మంది స్వచ్ఛందం గా పాల్గొని రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు సుబ్బరాయుడు, సుధాకర్, నాయబ్,ఇస్మాయిల్,తాతిరెడ్డి వీరారెడ్డి,గంగవరపు శ్రీనివాసులు నాయుడు, శాఖమూరి నారాయణ, గంగవరపు శ్రీధర్ నాయుడు, గంగినేని శ్రీను వాసు నాయుడు(డీకే), జిల్లా రైతు సంఘ అధ్యక్షులు మూలి వెంగయ్య, సిపిఎం మండల కార్యదర్శి సయ్యద్ రహమతుల్లా సిపిఐ మండల రైతు సంఘఅధ్యక్షులు గంగినేని నారాయణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించిన మాజీ సర్పంచ్

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు మండలంలోని మడమనూరు అక్కంపేట రహదారి మొత్తం పూర్తిగా దెబ్బతిని ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదివారం తన సొంత నిధులతో రోడ్డు మరమ్మ తులు చేయించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ అక్కంపేట గ్రామంలో తన సొంత నిధులతో ఎన్నో పనులు చేసి ప్రజల మనసులో మంచి పేరు సంపాదించుకున్నారు. మండలంలోని అనేక మంది పేద ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న వారిని గమనించి తనకు తగ్గ సహాయం చేసి ఆదుకుంటున్నారు. ఇలాంటి నాయకుడు మా గ్రామంలో ఉండడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: తిరుపతి లో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు ఎన్ రోల్మెంట్ గురించి చంద్రశేఖర్ రెడ్డి తో సమీక్షించారు. భవిష్యత్తు లో ప్రభుత్వ అధ్యాపకులు, ప్రైవేట్ విద్యా సంస్థ లను ఏ విధంగా సమన్వయం చేసుకుంటూ ముందుకుపోవాలో రామచంద్రా రెడ్డి వివరించారు.

ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాలు ఎమ్మెల్సీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఏపివైఎస్ఆర్టిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాలు ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డికి తిరుపతి జిల్లాలో సంపూర్ణ మద్దతు పలికారు. ఏపివైఎస్ఆర్టిఎఫ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో ఉపాధ్యాయ, అధ్యాపక,పట్టభద్రుల సంఘాలతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తిరుపతి యంపి గురుమూర్తి ,ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి హాజరై తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్న సేవలను గురించి వివరించారు. రెడ్ క్రాస్ చర్మన్ గా చంద్రశేఖర్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి లాంటి సేవభావం కలిగిన మంచి వ్యక్తిని ఎమ్మెల్సీ గా గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఏపివైఎస్ఆర్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు శారదా ,ఉపాధ్యాయ, అధ్యాపక సంఘా ల నేతలు, చంద్రశేఖర్ రెడ్డి ని అభినందించి సంపూర్ణ మద్దతు తెలుపారు.

భగవాన్ వెంకయ్య స్వామి ఆలయంను ప్రారంభించడం శుభపరిణామం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో గొలగమూడి వెంకయ్య స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమ వైద్యశాలను ప్రారంభించడం శుభపరిణామమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం వెంకటాచల మండలం గొలగమూడిలోని భగవాన్ వెంకయ్య స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన కార్తీక వనభోజనంలో మంత్రి పాల్గొన్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఈవో బాల సుబ్రహ్మణ్యం, ట్రస్టు సభ్యులు, అర్చకులు ఘన స్వాగ తం పలకగా, మంత్రి భగవాన్ వెంకయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రూ. 5 కోట్లతో నిర్మించిన భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమ వైద్యశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతోపాటు, సేవా దృక్పథంతో విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ భగవాన్ వెంకయ్య స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం మానవసేవే మాధవ సేవగా భావించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఈవో బాలసుబ్రమణ్యంను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ సమీపం లోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా పూర్తి ఉచితంగా అత్యాధునిక వసతులతో వైద్య సేవలు పొందాలనే లక్ష్యంతో ఈ వైద్యశాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వైద్యశాలలో ఆయుర్వేదం, హోమియోపతి, అల్లోపతి, ఫిజియోథెరపీ, కృత్రిమ అవయవాల ఏర్పాటు ఇలా అన్ని రకాల వైద్యసేవలు పేదలకు ఉచితంగా అందించ నున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పక్షవాతానికి గురైన వారికి మెరుగైన వైద్యం అందించి వారు త్వరగా కోలుకొని, కనీసం వారి పనులు వారు చేసుకునేలా వైద్య సేవలు అందించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ ఆసుపత్రిని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించినట్లు చెప్పారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక జూనియర్ కళాశాలను కూడా నిర్మించనున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకు సంబంధించి స్థలం కేటాయింపునకు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపినట్లు చెప్పారు. భగవాన్ వెంకయ్య స్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం ఆలయ సమీపంలో ఏర్పాటుచేసిన కార్తీక వనభోజనాలకు హాజరైన భక్తులకు మంత్రి స్వయంగా వడ్డించి, భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాలసుబ్రమణ్యం, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, శ్రీధర్, స్థానిక నాయకులు మండల వెంకట శేషయ్య, ప్రదీప్ రెడ్డి, రాజా నాయుడు పాల్గొన్నారు.

అల్పపీడనంతో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు అన్ని విధాల సహాయక చర్యలు చేపడుతూ, ముమ్మరంగా కొండాపురం, చేజర్ల, విడవలూరు, దిశా, రాపూరు, కొండాపురం ట్రాఫిక్ పోలీసులు విజబుల్ పోలీసింగ్ చేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు. ప్రజల సహాయార్థం, సహాయక చర్యల కోసం పోలీసు సిబ్బంది 24గంటలూ అందుబాటులో ఉండాలని ఎస్పీ ఆదేశించారు. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలింపు, నీరు నిల్వ లేకుండా బుచ్చి, గుడ్లూరు, కందుకూరు, నవాబుపేట, సంతపేట, కావలి రూరల్, కోవూరు, పొదలకూరు, కలువాయి, రాపూరు, వింజమూరు, అనంతసాగరం పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. గాలుల కారణంగా ప్రజలకు, ప్రజా రవాణా వ్యవస్థకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. రోడ్లపై విరిగిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో సహాయక చర్యల కోసం పోలీసు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉన్నాయి. అల్పపీడనం వల్ల ఏమైనా ఘటనలు తలెత్తినా, అత్యవసర పరిస్థితి వచ్చినా, సమస్యలకు గురైనా ప్రజలు, వెంటనే డయల్ - 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్:9440796383 కు సమాచారం తెలిపితే సహాయ చర్యలు చేయడానికి నెల్లూరు జిల్లా పోలీస్ యంత్రాగం 24 గంటలూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

వర్షపు నీటి ప్రాంతం పరిశీలన

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21 డివిజన్ ఉమారెడ్డి గుంటలో వర్షపు నీరు వచ్చి చేరడంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక వైసీపీ ఇన్చార్జి మొయిళ్ళ సురేష్ రెడ్డి పర్యటించారు. వర్షపు నీరు నిలిచిన పలు ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పరిస్థితిని పరిశీలించి స్థానికులను పలకరించారు. వర్షపు నీరు బయటకు వెళ్లేలా పలు చర్యలు తీసుకున్నారు.

గిరిజనులకు బిరియాని ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర-జలదంకి: పుట్టినరోజు జరుపుకుంటున్న కావలి పుల్లారెడ్డి నగర్ నివాసి కావలి వాసి ముమ్మడిశెట్టి పృథ్వీకృష్ణ, వారి కుమారుడు హితాన్ష్ ప్రద్యుమ్న మొదటి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా ఆధ్వర్యంలో జలదంకి మండలం గౌరవరం మేజర్ కాలువ కట్ట గిరిజనులకు బిరియాని ప్యాకెట్స్, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ గౌరవ సలహాదారులు, రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్, సినీ నటులు సిరాజ్ మొగల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో ఉన్న ఆనందం చాలా సంతోషాన్ని తృప్తి నిస్తుందని, ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అన్నారు. హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు ఘనీబాష చేస్తున్న సేవలను ఆయన కొనియా డారు. ఘనీబాష మాట్లాడుతూ గత 3 రోజులుగా వర్షాలకు ఎటు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న కరకట్ట గిరిజనులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా వుందని దాత ముమ్మడి శెట్టి, పృథ్వి కృష్ణ వారి కుమారుడు హితాన్ష్ ప్రద్యుమ్న్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వారి దాతృత్వాన్ని ప్రత్యేకంగా సంస్థ సభ్యులందరు అభినం దించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఘనీభాష, గౌరవ సలహా దారులు సిరాజమొగల్, సంస్థ సభ్యులు చేవూరి ప్రభయ్య, ఆంచింపక హజరతయ్య, బంకా క్రాంతి, సామాజిక కార్యకర్త ఎం. మాలకొండారెడ్డితో పాటు హ్యాపీ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మన్నేరు ప్రవాహం ఉధృతం

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలతో మండలంలోని అన్ని చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి . మండలంలోని మన్నేటికోట ప్రాంతంలో మన్నేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో మన్నేటికోట, ఆత్మకూరు మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. పోలీసు వారు మన్నేరు ఉధృతిని దృష్టిలో ఉంచుకొని స్థానికుల అటు ఇటు ప్రయాణం చేయకుండా ప్రాణాలపై ముప్పు తెచ్చుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ వర్షపాతం ఇలాగే నమోదు అయితే మరింత ఉధృతి పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు , మండల అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేన్ అధ్యకుడుని కలిసిన పేర్నాటి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 6వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక మహోత్సవముల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేన్ అధ్యకుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ని కలిసిన పేర్నాటీ కలిశారు. ఈరోజు ఏపీ రెవెన్యూ రాష్ట్ర కమిటీ ఆహ్వానం మేరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ నందు నిర్వహిస్తున్న ఆరవ రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలు, సాంస్కృతిక మహో త్సవంలో వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తూర్పు రాయలసీమలోని కొత్త 6 జిల్లాలకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అభ్యర్థిని పరిచయం చేశారు. బొప్పరాజు మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ రెడ్డి తో తనకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, మనమందరం కూడా రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో మన శ్యామ్ ప్రసాద్ రెడ్డికి మద్దతు తెలిపాలని, అధ్యక్ష, కార్యదర్శులు వారి జిల్లాల పరిధిలో పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు. పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తూర్పు రాయలసీమ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు పట్టభద్రుల ఎన్నికల్లో నా గెలుపునకు సహకరించాలని కోరారు. 36 నియోజక వర్గాల పరిధిలోని మీకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల, ఇంచార్జుల దగ్గరికి మీతో పాటుగా నేను వచ్చి ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు కృషి చేస్తానని తెలిపారు.

జగనన్న ఇల్లు పేదలందరికీ కన్నీళ్లు: జనసేన

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలం లోని రాపూరు మేజర్ పంచాయతీ లో జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వేంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని రాపూరు మండల జనసేన అధ్యక్షులు పొట్టే ళ్ల పెంచాల స్వామి రాపూరు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న మోసం అనే హాష్ టాగ్ లైన్ తో జన సేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశం మేరకు నెల్లూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాం త్ ఆమోదంతో పర్యటించామన్నారు. నవ రత్నాల్లో కీలక అంశం అయిన పేదలందరికీ సొంత ఇల్లు అందిస్తానని ముఖ్యమంత్రి వాగ్దానం చేశారని, రాష్ట్రంలో 68 వేల ఎకరాలో 28 లక్షలు ఇల్లు ఇస్తామని అన్న మాట ఏమి అయిందని ప్రశ్నించారు. ప్రభు త్వం ఏర్పాటు చేసి 4 సంవత్సరాలు గడుస్తున్నా రాపురు మండలం మొత్తం 36 ఎకరా లలో 600 ప్లాట్స్ కేటాయించి అందులో కొంత మంది లబ్ధిదా రులకు మాత్రమే పట్టాలు పం పిణీ చేసి కొంత మంది దగ్గర 10000 రూపాయలు వసూలు చేసి ఇప్పటి వరకు పట్టాలు పంపిణీ చేయకుండా అలాగే ఇల్లు కట్టుకునేందుకు ఎలాంటి మౌలిక సదుపాయాలు నిర్మిచకుండ, లేఅవుట్ అభివృద్ధి ప నులకు కోటి 50 లక్షలు నిధు లు విడుదల చేసి నాయకులు, అధికారులు మాయాజాలం చేశారన్నారు. అన్నీ మోసపు హా మీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేస్తున్నారని, ఇది నిజంగా జగన్ రెడ్డి ప్రభుత్వానికే సిగ్గు చేటు అన్నారు. ఇలాంటి మోసపూరిత హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలని మోసం చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి కాదు.. జగన్ మోసం రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం లో రాపూరు మండల అధ్యక్షుడు పొట్టేళ్ల పెంచలస్వామి, నెల్లూ రు జిల్లా ప్రధాన కార్యదర్శి గూ డూరు వేంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా సంయుక్త కార్యదర్శి చా ముండి రాధమ్మ, రాపూరు మండల కాపుసేన అధ్యకుడుబట్టు పెంచలయ్య, జనసైనికులు బెల్లం వేంకటేశ్వర్లు, వేమయ్య, శ్రీనివాస్, మల్లేశ్వర్ లు పాల్గొ న్నారు.

ఓవెల్ 14 స్కూల్లో విద్యార్థినికి వేధింపులు

-ఉద్యోగిని చితకబాదిన బాధిత బాలిక బంధువులు
- ఓవెల్ స్కూల్ గుర్తింపు రద్దు

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నెల్లూరు డైకస్ రోడ్డులోని ఓవెల్ 14 స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడి జరిగింది. శివ మాల దీక్షలో ఉన్న స్కూల్ ఉద్యోగి బ్రహ్మయ్య నాలుగో తరగతి బాలికపై లైంగిక దాడి చేశాడు. గత కొంత కాలంగా ఆ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు విచారణలో తేలింది. బ్రహ్మయ్య చర్యల పట్ల ఇబ్బంది పడుతున్న బాలిక గతంలో తల్లిదండ్రులకు చెప్పగా, పేరెంట్స్ మీటింగ్ లో అదే విషయాన్ని స్కూల్ యాజమాన్యానికి తెలియజేశారు. అయితే వారు పట్టించుకో లేదు. ఎవరు ప్రశ్నించడం లేదని ధీమాతో బ్రహ్మయ్య తన అసభ్యకర చేష్టలు కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇక భరించ లేని ఆ బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా శనివారం వారి కుటుంబ సభ్యులతో పాటూ బంధువులు ఓవెల్ స్కూల్ పై దాడికి పాల్పడ్డారు. కామంతో కన్ను మిన్ను తెలియని ఉద్యోగి బ్రహ్మయ్యను చితకబాదారు. సమాచారం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాలు ఓవెల్ స్కూల్ ఎదుట ఆందోళన నిర్వహించాయి. స్కూల్ యాజ మాన్యం పోలీసులకు సమాచారం అందించి, ఉద్యోగి బ్రహ్మయ్యను ఓ గదిలో ఉంచి తాళం వేశారు. గదిలో ఉన్న వ్యక్తిని బయటకు పంపాలని బంధువులు ఆందోళన చేపట్టారు. వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు బ్రహ్మయ్యను అదుపు లోకి తీసు కున్నారు. అతనిపై ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. వెంటనే అతన్ని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ కు పంపారు. ఓవెల్ స్కూల్లో జరిగిన ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు భయ పడిపోతున్నారు. దేవాలయాల లాంటి విద్యా సంస్థల్లో పిల్లలకు భద్రత లేకపోవడం ఖచ్చితంగా స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు స్కూల్ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి.

ఓవెల్ 14 పాఠశాల గుర్తింపు రద్దు

నెల్లూరు నగరం లోని డైకస్ రోడ్ తెలుగుగంగ కాలనీ సమీపం లోని ఓవెల్ స్కూల్14 పై వేటు పడింది. విద్యార్థినులు పట్ల పిఆర్వోగా పనిచేస్తున్న బ్రహ్మయ్య అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన లో స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వున్నట్టు డీఈవో గుర్తించారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి స్కూల్ గుర్తింపును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పిఆర్డియు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పిఆర్డియు ఆధ్వర్యంలో ఏపిటిఎఫ్, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్, మునిసిపల్ స్కూల్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్, మోడల్ స్కూల్స్ ప్రతినిధులు, గురుకులాల ప్రతినిధులు చిత్తూరు జిల్లాలో ఉపాధ్యాయులు, ఉపాధ్యా య సంఘాలతో రాష్ట్ర అధ్యక్షులు గిరిప్రసాద్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ సేవా భావం కలిగిన మంచి వ్యక్తి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని ఎమ్మెల్సీ గా గెలిపించు కోవాలని గిరిప్రసాద్ తో పాటు హాజరైన ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి కోరారు. ఇందులో పాల్గొన్నారు. అన్ని సంఘాలు చంద్రశేఖర్ రెడ్డి కి తమ సంపూర్ణ మద్దతు తెలపుతూ గెలిపించుకోవాలని వారి సభ్యులందరికి సూచించారు. ఉపాధ్యాయ వ్యవస్థ లో ఇది ఒక కీలక మలుపుగా హాజరైన వారు పేర్కొన్నారు. ఇలా టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు తెలపడం ఇదే ప్రథమని కల్పలత రెడ్డి అభిప్రాయపడ్డారు. హాజరైన ప్రతి ఒక్కరూ చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి, ఆయన మంచితనం గురించి ప్రశంసిస్తూ ప్రతి ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డికి అండగా నిలబ డాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెర్నేటి శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల నాయకుల సమావేశం

విశాలాంధ్ర- వలేటివారిపాళెం: టీడీపీ పిలుపుమేరకు కందుకూరు నియోజక వర్గ విస్తృతస్థాయి (ఆర్టీఎస్ (గ్రూప్) సమావేశం సోమవారం సాయంత్రం 3 గంటలకు కందుకూరు పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ , పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర , జోన్-4 పరిశీలకులు బిసి జనార్ధనరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దివి శివరాం , తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ పాల్గొంటారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జ్ లు, బూత్ లెవెల్ ఏజెంట్లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కందుకూరు తెలుగు యువత నాయకులు పేర్కొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయంలో నిత్యాన్నదానం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు లోని మహావిష్ణువు, అయ్యప్ప స్వామి దేవాలయం లో అక్టోబర్ 26 వ తేది నుండి డిసెంబర్ 5 వరకు మాల ధరించి దీక్ష భూనిన స్వాము లకు జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రంలో భాగం గా ఆదివారం రాపూరు నివాసులైన శనగపల్లి వెంకటరత్నం కుటుంబసభ్యులు అన్న దానం నిర్వహించారు. రాత్రి స్వాములకు బిక్షదాతలు స్వేతా రెడ్డి(బ్యాంక్ ఎంప్లాయి)కుటుం బ సభ్యులు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భం గా మహావిష్ణువు పాదాల చెంత కార్తీక మాసం అంతా గోత్ర నామాలు, ప్రత్యేక పూజలు సాయంత్రం మంత్రోచ్చారణల తో ఆకాశ దీపారాధన, నవంబ ర్ (14 వ తేదిన జరగవలసిన పూజ) 18 వ తేది శుక్రవారం ఆలయ ప్రాంగణంలో శ్రీఅయ్య ప్ప స్వామి మకరపూజ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డే వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం చిల్డ్రన్స్ డే ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోర్టు ఉద్యోగులు కార్మికులు కుటుంబ సభ్యులతో పాటు వందల మంది పిల్లలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిల్డ్రన్స్ డే ముందస్తు వేడుక సందర్భంగా పిల్లలకు డ్రాయింగ్ , మ్యాజిక్ షో, సింగింగ్, వ్యాసరచన, వక్తృత్వం, ఆర్చరీ ,వివిధ రకాల ఆటలు పోటీలను పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదాని కృష్ణపట్నం పోర్ట్ సీఈఓ జిజెరావు మాట్లాడుతూ పిల్లల్ని చూస్తుంటే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు వస్తున్నా యన్నారు. నేటి తరం పిల్లలు ఎంతో ఉత్సాహంగా ధైర్యంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొనటం ఆనందాయికమన్నారు. విద్యార్థులు చదువుల తోపాటు క్రీడలు వివిధ ఆటలు పోటీలతోపాటు వారి వారి ఆసక్తి ఉన్న రంగాలలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నేటి పిల్లలే రేపటి బావి భారత పౌరులని ఆయన తెలిపారు క్రమశిక్షణ పట్టుదలతో పిల్లలు ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలిపారు. ముందుగా మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ సి ఓ ఓ సంజయ్ కొత్త ,అదాని కృష్ణపట్నం పోర్ట్ అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, మనీష్ దావే, అశోక్ మిశ్రా, జైలాల్ రామకృష్ణ ,రామానంద్ యాదవ్ ,హెచ్ ఆర్ డి జిఎం సిహెచ్ శ్రీనివాస్, పుచ్చలపల్లి శ్రీనివాసులు, వివిధ విభాగాల హెచ్ఓడిలు ,ఉద్యోగులు, పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్ లకు 20శాతం పెనాల్టీ

విశాలాంధ్ర- కలిగిరి: కలిగిరి మండలం పరిధిలో జేసీ ఆదేశాలు మేరకు 3 అక్రమ లేఅవుట్లు గుర్తించారని మండల విస్తరణ అధికారి వెలుగోటి మధు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కలిగిరి పంచాయతీ లో 2 , నాగసముద్రం పంచాయతిలో 1, మొత్తం 3 అనుమతి లేని లే అవుట్ లు ఉన్నాయని తెలిపారు. ఈ అక్రమ లే అవుట్ లకు ఆ ల్యాండ్ మార్కెట్ వాల్యూలో 20 శాతం పెనాల్టీ చెల్లించాలని నోటీసులు తయారు చేశారు. నోటీసులు జారీకి సర్వం సిద్ధమని, ప్రభుత్వ అనుమతులు పొందాలంటూ సూచించారు. పెనాల్టీ చెల్లించకుంటే పంచాయతీ రాజ్ చట్టం లే అవుట్ నియమనిబంధనలు ప్రకారం గ్రామపంచాయతీ వారిచే లే అవుట్ లలోని సర్వే రాళ్లను, లే అవుట్ లను తొలగించి దానికి అయ్యే ఖర్చును లే అవుట్ దారులనుండి వసూలు చేస్తామని ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికి అందాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అందచేస్తున్న సంక్షేమ పథకాలన్ని అర్హులందరికి అందేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చర్యలు తీసు కోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 6, 10, 11 వార్డులకు సంబంధించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలపై పట్టణంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 6, 10, 11 వార్డుల శాఖల వారీగా వచ్చిన సమస్యలపై లబ్దిదారు లను పిలిపించి అధికారుల సమక్షంలో ఎంత కాల వ్యవధిలో పరిష్కారమవుతాయో తెలపాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి రెండు నెలలకోసారి రివ్యూ సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ వార్డుల పరిధిలో నిర్వహించిన సర్వే ఆధారంగా 600 సమస్యలను గుర్తించామని, అందులో సగానికి పైగా సాంకేతిక కారణాలతో నిలిచి పోయాయని విషయాన్ని తెలుసుకుని త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 10 వార్డు జమ్మల పాంకు చెందిన గిరిజనులు తమ పిల్లలకు ఆధార్ కార్డులు కావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే వారి సమస్య పరిష్కరించాలని తహశీల్దారుకు ఆదేశించారు. 11వ వార్డులో రేషన్ డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అతనిపై ఎమ్మెల్యే మేకపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేట ర్లతో సయోధ్యగా రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం సచివాలయాలకు అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు వంతున మంజూరు చేసిందని పనుల ప్రాధాన్యత గుర్తించి నివేదికలు ఇస్తే ఆ మేరకు పనులు మొదలు పెట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల పని తీరు చాలా బాగుందని, ఇలాగే వృత్తి పట్ల అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: భారీ వర్షాలు కారణంగా నెల్లూరు రూరల్ నియోజక వర్గం పరిధిలోని 32 వ డివిజన్ లో సంజయ్ గాంధీ నగర్ 9వ వీధి లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అక్కడి పరిస్థితు లను పరిశీలించి వారికి నిత్యావసరం వస్తువుల తోపాటు కొంత ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు

గ్రామ సింహాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

విశాలాంధ్ర- నెల్లూరు: కొండాపురం మండలంలోని పార్లపల్లి, అదిమూర్తిపురం, సత్యవోలు, గుడవల్లూరు, కొమ్మి,తూర్పు యర్రబల్లి,జంగాలపల్లి పలు గ్రామాలలో గ్రామ సింహాలు రోడ్డుపైన వెళుతున్న వాహన దారులనను ,చిన్న పిల్లలను హడలెత్తిస్తున్నాయి. ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. కొండాపురం మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకీ అధికమవుతోంది గ్రామాల్లోని పలు వీధుల్లో రోడ్డుమీద తిరుగుతూ ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులపై గాయ పరుస్తున్నాయి. పల్లెల్లో బజారులో తిరగాలన్న వాహనాలా మీద పోవాలన్నా, పశువులు, జీవాలు , లేగ దూడలు, తోలుకు పోవాలంటే వీధి కుక్కలు గుంపులు గుంపులుగా ఉండి దాడి చేస్తున్నాయి. మరి చిన్న పిల్లలు స్కూల్ కి పోవాలంటే తల్లితండ్రిలు భయపడు తున్నారు.గ్రామాలను రక్షించాల్సిన గ్రామ సింహాలే ప్రజల పాలిట మృత్యు సింహాలుగా మారుతున్నాయి. ప్రతి గ్రామంలో ప్రతి వీధికి ఐదు నుండి ఆరు కుక్కలు తక్కువ లేకుండా గ్రామ సింహాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీటి నియంత్రణ లేక పోవడంతో వాటి సంతానం గణనీయంగా పెరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు తెలియపరిచినా పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. వీధి కుక్కలని చంపకూడదని అధికారులు తెలుపుతున్నారని, మనుషులను గాయ పరిచి ఆసుపత్రి పాలు అయినా జీవాలను, పశువులను గాయ పరిచినా, నష్ట పరిచినా ఫర్వాలేదా? అని ప్రజలు నీలదీస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుం టున్నారు. ఇప్పటి కయినా జిల్లా స్థాయి అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను అరికట్టి ప్రజలు ప్రాణాలు కాపాడలని కోరారు.

కోడిపందెం స్థావరాలపై దాడి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: వింజమూరు మండలం వెంకటాద్రి పాలెంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురుని అరెస్ట్ చేశారు. వెయ్యి రూపాయలు నగదు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నారు.

పీఎంశ్రీకి గోనుపల్లి పాఠశాల ఎంపిక

ఎంపికైన పాఠశాలలకు కేంద్ర సహకారం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలం లోని గోనుపల్లి గ్రామ పాఠశాల కేంద్ర ప్రభుత్వం ప్రక టించిన పీఎం శ్రీ పాఠశాలల జాబితాలో ఎంపికవడంతో మండలం లోని అధికారు లకు, నాయకులకు, గ్రామప్రజలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, అందరికి గోనుపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు నాగేంద్ర కుమార్ హృదయ పూర్వక అభినందనలు, శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యంత నాణ్యమైనవిద్య అందించేందుకు కొత్తగా కేంద్ర ప్రభు త్వం పీఎం శ్రీ పథకం ప్రవేశపె ట్టిందని జిల్లాల్లో 1096 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశా లలను ఎంపిక చేశారని, యూ డైస్2021-22 విద్యార్థుల సం ఖ్యను ప్రామాణికంగా తీసుకుని వీటి ఎంపిక జరిగిందన్నారు. జిల్లా స్థా యిలో ఈ పథకానికి నోడల్ అధికారిగా డిఇఓ వ్యవహరిస్తారని తెలిపారు. రాపూరు మండలం లోని ఉపాధ్యాయులకు, పాఠశాల ఉపాధ్యాయులకు, అందుకు సహక రించిన మండల విద్యాశాఖాధి కారిగుండవోలు శ్రీనువాసులు, పాఠశాల తల్లిదండ్రులు కమిటీకి, గ్రామ పెద్దలు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, గోనుపల్లి గ్రామ సర్పంచ్ గోతాటి నారాయణమ్మ దంపతులకు, పాఠశాల పిసి కమిటీ చైర్మన్ మోపూరు ప్రశన్న, మాజీ సర్పంచ్ శివకుమార్ రెడ్డి, ఎగిటీల నార సింహయ్య, గ్రామస్తులకు తమ ఉపాధ్యాయ బృందం నరేంద్ర (సైన్స్) శ్రీనువాసులు(ఇంగ్లీష్), విజయలక్ష్మి (హిందీ), ప రంధామయ్య (సోషల్), రాజేశ్వ రి(తెలుగు), భాగ్యలక్ష్మి (జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అ వార్డు గ్రహీత) ప్రభావతి, ప్రసా ద్, కుమారి విజయ, సిఆర్పి నరసింహులు, గాలి శంకరమ్మ (మధ్యాహ్న భోజన నిర్వాహకులు), పులగల ఆదిలక్ష్మి(ఆయా) నరసింహులు(వాచ్‌మ్యాన్),పెను బర్తి పాఠశాలలు సముదాయం లోని అందరూ ఉపాధ్యాయులకు తమ మిత్రులు తుపాకుల శ్రీకృష్ణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ స్ రమీజ్ , ఖుద్దూస్, జిల్లా విద్యాశాఖ అధికారులకు, సహకరిస్తున్న మిత్రులకు , పాఠశాల అభివృద్ధికీ , విద్యాభివృద్ధికి దోహదం చేస్తున్న ప్రతి ఒక్కరికి ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర కుమార్ హృదయపూర్వ క అభి నందనలు, శుభాకాంక్షలు తెలిపారు.